900) ముఖారి

ప॥ గోవిందాది నామోచ్చారణ కొల్లలు దొరకెను మనకిపుడు।
ఆవలనీవల నోర గుమ్మలుగ నాడుద మీతని పాడుదము॥

చ॥ సత్యము సత్యము సకలసురలలో । నిత్యుడు శ్రీహరి నిర్మలుడు।
ప్రత్యక్షమిదే ప్రాణులలోపల । అత్యంతము శరణనరో యితని॥

చ॥ చాటెడి చాటెడి సకలవేదములు । పాటించినహరి పరమమని।
కూటస్థుడితడు గోపవధూపతి । కోటికి యీతని గొలువరో జనులు॥

చ॥ నిలుచున్నాడిదె నేడును నెదుటను । కలిగిన శ్రీవేంకటవిభుడు।
వలసినవారికి వరదుడీతడు । కలడు గలడితని గని మనరో॥